

2

కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -54 ఆదివారం 26 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి




**అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి**

**తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం**

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** : చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయనిఅన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. ద

మిగతా 2లో.



# ధర్మేంద్రప్రధాన్ రాజీనామా..!


**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తప్పుకొంటున్నట్లు ప్రకటన**

**గత కొన్నిరోజుల పరిణామాలు బాధించాయని వ్యాఖ్య**

**వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం లేదని వెల్లడి**

**యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు లేఖలో పేర్కొన్న వైనం**

**మోదీకి రాజీనామా పత్రాన్ని పంపిన ప్రధాన్**



**ఢిల్లీ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలపై కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించిన ఆయన.. దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షల్లో అక్రమాలు

మిగతా 2లో.

## డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలి

**నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా చేశారని జగన్ వ్యాఖ్య**

**ఎన్డీఏ ప్రమాణాలను ఏపీలోనూ పాటించాలని సూచన**

**కొడుకును కాపాడుకుంటారా అంటూ సీఎంకు జగన్ ప్రశ్న**



**అమరావతి,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్

మిగతా 2లో.

## డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

**నిరసన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ**

**విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ**

**36 రోజుల పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కొనసాగిన ఆందోళన**

**కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల సంయుక్త మీడియా సమావేశంలో ప్రకటన**



**ఢిల్లీ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తమ నిరసనను విరమించింది. తమ ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం

మిగతా 2లో.

## ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడి**



**అమరావతిజూలై 25 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) పక్రియలో భాగంగా

మిగతా 2లో.

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి**

**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి**




2లో.

## పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి..

**శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు**

**పొగాకు రైతుల సమస్యలపై రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం**

**తాత్కాలిక ఉపశమనం కాదు, శాశ్వత పరిష్కారం కావాలన్న సీఎం**

**రైతులను ఆదుకునేందుకు కేంద్ర బృందం మూడు ప్రతిపాదనలు**

**బయ్యర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు..**



2లో.


## ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్..

**040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు**

**ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది**

**లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ**



**హైదరాబాద్ ,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అపోహలకు

మిగతా 2లో.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..!

(మొదటి పేజీ తరువాయి)
వెలుగులోకి రాగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి రీ-ఎగ్జామ్ నిర్వహించిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.
20 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని ప్రధాన్ చెప్పారు. పరీక్షా మాఫియా వల్ల ఒక్క ప్రతిభావంతుడికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. అయితే రీ-ఎగ్జామ్ ఫలితాల సమయంలో కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు.
గత పది రోజులుగా జరిగిన పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని, ఇది వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దేశ వ్యతిరేక శక్తులు ఈ అంశాన్ని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడేందుకు, వారు చదువుపై దృష్టి పెట్టేలా చేయడానికే తాను రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ప్రజాసేవను ఇకముందు కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు.కొందరు నిరుద్యోగులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలతో పుట్టిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ).. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో అవకతవకలపై 2026 జూన్ నుంచి ఉద్యమం మొదలుపెట్టింది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఢిల్లీలోని జంతర్‌మంత్ వేదికగా సాగిన ఈ పోరు అనతి కాలంలో అనూహ్య ఆదరణను సొంతం చేసుకుంది. జులై 20న పార్లమెంట్ ముట్టడి లక్ష్యంగా తలపెట్టిన 'చలో సంసద్' కార్యక్రమంతో ఉద్యమం మరో స్థాయికి చేరింది. పోలీసుల లాఠీఛార్జి, వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం వంటి పరిణామాలతో దేశవ్యాప్తంగా యువత, ప్రముఖులు తమ గొంతుకను వినిపించారు.దీంతో దిగొచ్చిన కేంద్రం విద్యార్థులతో చర్చలు ప్రారంభించింది. స్వయంగా ప్రధాని ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రకటనలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే సంబంధిత చట్టాలను సైతం కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులతో శుక్రవారం రెండు దఫాలు చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. వాటిలో నీట్ పేపర్ లీక్ వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసన చేపట్టిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని హామీ వంటి వాటికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో వాంగ్‌చుక్ సైతం తన దీక్షను విరమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం సంశయించింది. కానీ, విద్యార్థులు ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పడంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు.

# పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి..

**అమరావతి,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి బృందాన్ని రాష్ట్రానికి పంపింది. శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు.ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. "తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు.సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)
. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**హైదరాబాద్,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷-లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

(మొదటి పేజీ తరువాయి)
అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రులు, సీజేపీ ప్రతినిధులు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం... కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ లతో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా మరో దఫా చర్చలు జరిపారు. చర్చలు ముగిసిన అనంతరం జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్న సద్భావనతో నిరసనను తక్షణమే విరమిస్తున్నట్లు వారు తెలిపారు. తమ మద్దతుదారులంతా శాంతియుతంగా ఇళ్లకు తిరిగి వెళ్లాలని పిలుపునిచ్చారు.మంత్రి రాజీనామాతో పాటు, ప్రభుత్వం మరికొన్ని కీలక హామీలు ఇచ్చినట్లు సీజేపీ నేతలు వెల్లడించారు. నీట్ ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్తులో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే, నీట్ వ్యవహారంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం గరిష్ఠ పరిహారం అందజేస్తామని స్పష్టం చేసిందని వివరించారు.ఈ సందర్భంగా సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించింది. కాబట్టి ఆందోళన చేస్తున్న వారందరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుతున్నాం" అని అన్నారు. అశుతోష్ రంకా మాట్లాడుతూ, "36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం దిగివచ్చింది. మా డిమాండ్లు తీవ్రమైనవి కావు, చాలా సాధారణమైనవి. ఇప్పుడు ప్రభుత్వం వాటిని ఆమోదించింది" అని పేర్కొన్నారు

# ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సీఈఓ వివేక్ యాదవ్ ప్రకటించారు.

# డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలి

(మొదటి పేజీ తరువాయి)
పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు.ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.


# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్..

(మొదటి పేజీ తరువాయి)
తావులేకుండా పూర్తి సమాచారం అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలు దళారులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారం పొందాలని సూచించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందిస్తుందని తెలిపారు.
దరఖాస్తు చేసుకునే సమయంలో కేవలం ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ సమయంలో ఆ పత్రాలను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10,000 ఈఎండీని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. ఒకవేళ లాటరీలో ఇల్లు కేటాయించకపోతే, ఆ మొత్తం తిరిగి అదే ఖాతాకు జమ అవుతుందని భరోసా ఇచ్చారు.హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుడికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1దీఒఖ ఫ్లాట్‌ను నిర్మిస్తున్నామని, దీని మార్కెట్ విలువ రూ.40-60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనుండగా, లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య వాటా (ఖఐూ) స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పొంగులేటి తెలిపారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హుల సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.ం

# కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి

## ప్రస్తుతం ఆహారం, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రిగానూ జోషి బాధ్యతలు

**ఢిల్లీ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వివాదం కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పుకు దారితీసింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. అనంతరం, ఆయన స్థానంలో సీనియర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది.



నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు.
ఈ క్రమంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. ప్రధానమంత్రి సలహా మేరకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(2) ప్రకారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి తక్షణమే ఆమోదించారు.నూతన విద్యాశాఖ మంత్రిగా నియమితులైన 64 ఏళ్ల ప్రహ్లాద్ జోషి, కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2004 నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా (2019-2024) సమర్థంగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఆహార (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన), పునరుత్పాదక ఇంధన (పీఎం సూర్య ఘర్ యోజన) శాఖల మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కర్ణాటకలో మధ్యాహ్న భోజన పథకాలతో ఆయనకు గతంలో అనుబంధం ఉంది.ఈ నియామక ప్రకటన వెలువడే సమయానికి ప్రహ్లాద్ జోషి తన నియోజకవర్గంలో పర్యటనలో ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని, హుబ్లీ నుంచి రాత్రి 7:30 గంటల విమానంలో ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలంలో నూతన జాతీయ విద్యా విధానం (NEP 2020) అమలుతో పాటు అనేక సంస్కరణలు జరిగాయని ప్రశంసించారు.

RNI NO: TELTEL/2023/87607

# రాజకీయాలకు అతీతంగా సర్ నిర్వహించాలి

## అర్హులంతా ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలి -ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి








**కేయూ క్యాంపస్/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో శనివారం నిర్వహించిన 'సర్'పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఓటు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఓటర్ల తొలగింపు కుట్రలు సాగవని, ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో 'సర్' ప్రక్రియ మందగించినప్పటికీ, తమ నియోజకవర్గంలో బీఎల్‌వోలు, బీఎల్ఏల సహకారంతో ఇప్పటికే 58 శాతం పూర్తి చేశామని, మరో వారం రోజుల్లో 80 శాతానికి చేరుకునేలా చర్యలు చేపట్టామని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఓటు హక్కు పరిరక్షణకు ప్రజల్లో మరింత అవగాహన అవసరమన్నారు. ప్రొఫెసర్ రాజారాం మాట్లాడుతూ ఆగస్టు 3 వరకు 'సర్' ప్రక్రియ కొనసాగుతుందని, ఆగస్టు 8న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ దరఖాస్తు ప్రక్రియలో ఉన్న సంక్లిష్టతలను తొలగించాలని సూచించారు. యువత, మేధావులు, పౌర సమాజం ఓటు హక్కు పరిరక్షణలో బాధ్యత తీసుకోవాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సర్‌పై ప్రజలను చైతన్యవంతులను చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత వచ్చే అభ్యంతరాల పరిష్కారంలోనూ మీడియా చొరవ చూపాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ యాదగిరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య బలోపేతానికి 'సర్' ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ సదానందం, డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ చందా మల్లయ్య, మెరుగు బాబు యాదవ్, దామేర ఉపేందర్, రాజ్ మహమ్మద్, డాక్టర్ తాడూరి శాస్త్రి, గొడిశాల సత్యనారాయణ గౌడ్, డాక్టర్ నల్లారి శ్రీనివాస్, కంజర్ల నరసింహారాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ సంపత్ కుమార్, డి. రామాచారి, డాక్టర్ మోటె చిరంజీవి, సురేందర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే నా శ్రేయస్సు..

# ప్రజల సేవకే నా జీవితం

## వైకుంఠధామంలో సొంత ఖర్చుతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

## సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు





**ఎల్కతుర్తి/జూలై26(జర్నలిస్ట్ వార్త):** ప్రజల సంక్షేమమే తన శ్రేయస్సని, గ్రామాభివృద్ధికే తన జీవితం అంకితమని సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు, వీరనారాయణపూర్ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్‌రావు అన్నారు. గ్రామంలోని వైకుంఠధామం వద్ద విద్యుత్ స్తంభాలు లేక రాత్రి వేళల్లో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి, సొంత ఖర్చుతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వీరనారాయణపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వైకుంఠధామం వద్ద విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు, మృతుల బంధువులు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో వెలుతురు అందుబాటులోకి వచ్చి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. సొంత నిధులతో ఈ పనిని పూర్తి చేసిన పుల్లూరి శ్రీధర్‌రావును గ్రామ ప్రజలు అభినందించారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా విద్యార్థుల విజయమే : రౌతు రమేష్



**హసన్‌పర్తి/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన ఉద్యమానికి దక్కిన విజయమని దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ఫలించాయని, విద్యార్థుల ఐక్యతకు ఇది నిదర్శనమని ఆయన అన్నారు. నిరసనలను అణచివేసేందుకు బలప్రయోగం చేయడం, విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులు, సామాజిక సంస్థలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఉద్యమాలకు ప్రజల మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం గమనించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తూ విద్యార్థుల ఉద్యమాలను అణచివేసే ప్రయత్నాలకు స్వస్తి పలకాలని, ప్రజల అభిప్రాయాలను గౌరవించే విధానాలను ప్రభుత్వం అవలంబించాలని రౌతు రమేష్ కుమార్ తన ప్రకటనలో కోరారు.

# బోడగుట్ట ప్రభుత్వ భూములపై ఆక్రమణల ఆరోపణలు

## సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి







**ఎల్కతుర్తి/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని దామెర గ్రామ పరిధిలోని బోడగుట్ట, ఎల్లమ్మ ఒర్రె సమీప ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు కనిపించడం లేదని శనివారం మీడియా దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్తుల కథనం ప్రకారం, సర్వే నంబర్లు 415/బి, 866 పరిధిలోని ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని చదును చేసి సాగుకు వినియోగిస్తున్నట్లు ఆరోపించారు. ఎల్లమ్మ ఒర్రె సమీపంలో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. అంతేకాకుండా, గొల్లవాడ నుంచి బోడగుట్ట మీదుగా ఎల్లమ్మ ఆలయం, వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న సంప్రదాయ దారిని కూడా మూసివేశారని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో రైతులు, పశుపోషకులు, గ్రామస్థులు అదనపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ అంశంపై సంబంధిత రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు తక్షణమే అధికారిక సర్వే నిర్వహించి, ఆక్రమణలు ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల రాకపోకలకు ఉన్న దారిని పునరుద్ధరించాలని వారు కోరారు.

# మిరాకిల్ మైండ్స్‌లో విద్యార్థి నాయకత్వానికి పట్టం

## ఘనంగా ఇన్వెస్టీచర్ సెరిమనీ




**సత్తుపల్లి/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణ పెంపొందించే లక్ష్యంతో సత్తుపల్లి సిద్ధారం రోడ్డులోని మిరాకిల్ మైండ్స్‌ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టీచర్ సెరిమనీని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, హౌస్ పతాకాలు అందజేసి బాధ్యతలు అప్పగించారు. లీడర్‌షిప్ విత్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఇంటెగ్రిటీ అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు బాధ్యతతో కూడిన నాయకత్వాన్ని ప్రదర్శించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది. విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తి, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు నాలుగు హౌస్‌లను ఏర్పాటు చేశారు. ఇగ్నైట్ (రెడ్ హౌస్), ఇన్‌స్పైర్ (బ్లూ హౌస్), అచీవ్ (గ్రీన్ హౌస్), ఎక్సెల్ (యెల్లో హౌస్)లకు ఆయా చిహ్నాలు, పతాకాలను ఆవిష్కరించి విద్యార్థులకు పరిచయం చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పాఠశాల దశ నుంచే పెంపొందించడం అవసరమని అన్నారు. బాధ్యత, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగితేనే సమాజానికి ఆదర్శ నాయకులుగా ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

# గిరిజన నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ

## సీడీసీ, కింగ్ టు ద కింగ్డమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం






**తల్లాడ/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** గిరిజన, కోయ నిరుపేద కుటుంబాలకు చేయూతనందించే లక్ష్యంతో సీడీసీ (కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్), కింగ్ టు ద కింగ్డమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కొత్తమేడేపల్లి గ్రామంలోని గిరిజన చిన్నారులు, నిరుపేద కుటుంబాలకు తల్లాడ టీసీసీ అధ్యక్షులు ఖమ్మంపాటి ఇశ్రాయేలు చేతుల మీదుగా సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మంపాటి ఇశ్రాయేలు మాట్లాడుతూ, కింగ్ టు ద కింగ్డమ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు వంగల రత్న ప్రసాద్ ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలోని పేద, గిరిజన కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వంగల రత్న ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గొల్లమందల దేవాసహాయం, గుంటి బాబురావు, రావూరి కృష్ణయ్య, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలి

## కరపత్రం ఆవిష్కరించిన ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



**ఎల్కతుర్తి/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించే రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సూరారం గ్రామంలో సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ రిజర్వేషన్ల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభకు విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, విద్యావంతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు మొలుగూరు రమేష్, ఉపసర్పంచ్ మేకల బాబు, 9వ వార్డు సభ్యుడు మారుపాక రవీందర్, పొన్నాల వినోద్ కుమార్, మేకల కిషన్, మణుగూరు జేమ్స్, గడిపే ప్రశాంత్, మేకల శంకర్, మణుగూరు భాస్కర్, మేకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థి ఎన్నికలు

## రహస్య బ్యాలెట్‌తో ప్రజాస్వామ్య పాఠాలు







**సత్తుపల్లి/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల విధానంపై అవగాహన పెంపొందించేందుకు విశ్వశాంతి విద్యాలయంలో శనివారం విద్యార్థి నాయకుల ఎన్నికలను రహస్య బ్యాలెట్ విధానంలో నిర్వహించారు. భారత ఎన్నికల ప్రక్రియను పోలిన విధంగా ప్రతి దశను నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ప్రచారం, అభ్యర్థులకు బ్యాలెట్ గుర్తుల కేటాయింపు, రహస్య బ్యాలెట్ ద్వారా పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఎన్నికైన ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించడం, నియామక పత్రాల అందజేత వరకు అన్ని దశలను వివరంగా నిర్వహించారు.

తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టగా, ఇతర తరగతుల విద్యార్థులు ఆసక్తిగా వీక్షించి ఎన్నికల విధానంపై అవగాహన పెంపొందించుకున్నారు. ఉపాధ్యాయులు కూడా తమ ఓటు హక్కును వినియోగించి ఎన్నికలను ఉత్సాహంగా నిర్వహించారు. ఎన్నికల ఫలితాల్లో హెడ్ బాయ్‌గా ఓం సాయి, హెడ్ గర్ల్‌గా వెన్నెల, డిప్యూటీ హెడ్ బాయ్‌గా ఇమ్రాన్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా అపూర్వ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించడమే ఈ ఎన్నికల నిర్వహణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం కీలకం

## బీసీ వెల్ఫేర్ కల్లూరు సబ్ డివిజనల్ అధికారి గ్రేసమ్మ

**సత్తుపల్లి/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే వారి కృషికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం తప్పనిసరిగా ఉండాలని బీసీ వెల్ఫేర్ కల్లూరు సబ్ డివిజనల్ అధికారి గ్రేసమ్మ అన్నారు. శనివారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రేసమ్మ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తరచూ వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల చదువు, ఆరోగ్యం, వసతి సౌకర్యాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, తల్లిదండ్రులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ




సమావేశంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోందు, విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, బీసీ బాలికల కళాశాల వార్డెన్ జ్యోత్స్న, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# త్రివేణి పాఠశాలలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



**సత్తుపల్లి, /జూలై 26 (జర్నలిస్టు వార్త వార్త):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సత్తుపల్లి శాఖ త్రివేణి పాఠశాలలో శనివారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీర జవాన్లకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత, క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకడమిక్ ఇన్‌చార్జ్ పవన్, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీపద్మ మాట్లాడుతూ దేశభక్తి ప్రతి భారతీయుడి ప్రధాన కర్తవ్యమని అన్నారు. దేశాన్ని ప్రేమించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడడం, దేశ సమగ్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్గిల్ అమర వీరుల త్యాగం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, వారి ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ తమ సందేశంలో కార్గిల్ అమర జవాన్ల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, దేశ భద్రత కోసం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికుల సేవలను గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, అమర జవాన్లకు మౌనం పాటించి నివాళులర్పించారు. దేశం పట్ల ప్రేమ, క్రమశిక్షణ, బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

# కిట్స్ వరంగల్‌లో ఘనంగా అలమ్నై మీట్ సిల్వర్ జూబ్లీ రీయూనియన్ సంబరాలు

## ప్రపంచ నలుమూలల నుంచి హాజరైన పూర్వ విద్యార్థులు - సంస్థ అభివృద్ధికి రూ.2.7 కోట్లకు పైగా సహకారం







**హసన్‌పర్తి/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్‌లో శనివారం అలమ్నై అసోసియేషన్ ఆధ్వర్యంలో 'అలమ్నై మీట్ అండ్ సిల్వర్ జూబ్లీ బ్యాచ్ (క్లాస్ ఆఫ్2001) రీయూనియన్' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు, కిట్స్‌వా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై తమ కళాశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాన్ని అమెరికాలోని ఆపిల్ సంస్థలో క్యూ.ఏ లీడ్‌గా పనిచేస్తున్న, కిట్స్‌వా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు మమత కంది జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కిట్స్ అదనపు కార్యదర్శి వి. సతీష్‌కుమార్ పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా సంస్థకు మంచి పేరు తీసుకొచ్చారని అభినందించారు. మమత కంది మాట్లాడుతూ కిట్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 28 వేల మందికి పైగా పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ ఉందని, వారి సహకారంతో విద్యార్థులకు మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో అనుసంధానం వంటి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని తెలిపారు. 21వ శతాబ్దానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కిట్స్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇప్పటివరకు సంస్థ అభివృద్ధికి రూ. 2.7 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఐఈ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి వై. జగన్‌రెడ్డి రూ. 2 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక ప్రయోగశాలను ఏర్పాటు చేశారని వెల్లడించారు. విదేశాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరుకాగా, 131 మంది ముందస్తుగా నమోదు చేసుకున్నారని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే, కిట్స్ అదనపు కార్యదర్శి వి. సతీష్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ 19972001 బ్యాచ్‌ను లి'గోల్డ్ కేటగిరీ బ్యాచ్'లిగా అభివర్ణించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని ప్రస్తుత విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా 19972001 బ్యాచ్ విద్యార్థులు తమకు బోధించిన అధ్యాపకులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖ పూర్వ విద్యార్థులు, యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, 300 మందికి పైగా అలమ్నై సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# తొలి ఏకాదశి వేళ భక్తిశ్రద్ధలతో భీరన్న కామరాతి ఉత్సవాలు

## హసన్‌పర్తిలో ఘనంగా నిర్వహణ.. పోటెత్తిన భక్తజనం



**హసన్‌పర్తి/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని హసన్‌పర్తిలో గొల్లకురుమల ఆరాధ్యదైవం భీరన్న కామరాతి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. సాంప్రదాయ మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. మహిళలు బోనాలు, పూలతో భక్తిశ్రద్ధలతో పాల్గొనగా, యువకులు ఉత్సవాల నిర్వహణలో సేవలందించారు. ఈ సందర్భంగా 66వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, ఎర్రగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, మాజీ ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్‌తో పాటు గొల్లకురుమ సంఘ నాయకులు కోరే కుమారస్వామి, దాడి పెద్దరాజు, మారం సుధాకర్, దాడి చిరంజీవి, నంద అనిల్ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ధర్మేంద్ర ప్రధాన్ తర్వాత ప్రధాని మోదీనే దిగాలి

## : జంగ రాఘవరెడ్డి



**హసన్‌పర్తి/ జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఐక్య ఉద్యమానికి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని పోరాటానికి దక్కిన విజయమని కాంగ్రెస్ నాయకుడు జంగ రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కూడా పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులు, యువత బెదిరింపులకు, కేసులకు, లాఠీచార్జీలకు భయపడకుండా పోరాడి కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని దేశ ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలకు విద్యార్థి ఉద్యమం గట్టి సమాధానం చెప్పిందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తికి నిదర్శనమని, ఇది ఆ పార్టీ పతనానికి తొలి సంకేతమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌ను దాచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, విద్యార్థి శక్తి ముందు చివరకు తలవంచాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన, ప్రజా వ్యతిరేక విధానాల వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని జంగ రాఘవరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం

**ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు**

**ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్**

**వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ**

**గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ**

**పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు**




**ఆలూరు జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు.

**సంజీవని.. సమగ్ర ఆరోగ్య వ్యవస్థ**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు.

కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా–శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ–ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం–2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు.. సాగునీటిపై హామీ**

గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ నేతలు ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తేలేదని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయని వారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేదవతి ప్రాజెక్టును రూ. 1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు.

**ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్‌ను**

సభ అనంతరం అదే వేదికపై నుంచి ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాను గత పాలకుల్లా పరదాలు కట్టుకుని, చెట్లు నరికించి సభలు పెట్టడం లేదని, ప్రజల మధ్యకు నేరుగా వస్తున్నానని అన్నారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 197 కోట్ల చెక్కును సీఎం అందజేశారు.

# ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్‌కు భట్టి అభినందనలు



**తల్లాడ/జూలై 25 (జర్నలిస్ట్ వార్త వార్త):** టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియామకమైన తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. శనివారం ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రిని వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువై పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, సీనియర్ నాయకులు కాపా అప్పయ్య, కాపా రామారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



# కూలిన ఇల్లు.. రోడ్డున పడ్డ వృద్ధ దంపతులు

## చెట్ల కింద ఉండటంతో తప్పిన ప్రాణాపాయం



**తల్లాడ/జూలై 25 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఓ ఇల్లు శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోవడంతో వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. ప్రమాదం సంభవించే సమయంలో వారు ఇంటి బయట చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటుండటంతో పెను ప్రమాదం తప్పింది.గ్రామానికి చెందిన ఎక్కిరాల నాగయ్య (80), రుక్కినమ్మ దంపతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇంట్లోనే గత కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఇంటి బయట చెట్ల కింద నిద్రిస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఇల్లు కుప్పకూలింది. అప్రమత్తమైన వారు వెంటనే అక్కడికి చేరుకుని చూడగా ఇంట్లోని సామగ్రి, వంట పాత్రలు శిథిలాల కింద నలిగిపోయాయి.ఇంటి కూలిపోవడంతో జీవిత చరమాంకంలో తలదాచుకునే నీడ కూడా లేక రోడ్డున పడ్డామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తమకు తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు గృహ వసతి కల్పించి ఆదుకోవాలని వారు వేడుకున్నారు. స్థానికులు కూడా బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలని కోరుతున్నారు.

# బయ్యారంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు.



**బయ్యారం/,జులై 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామచంద్రస్వామి దేవాలయంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు సుదర్శనాచార్యులు శాస్త్రోక్తంగా అభిషేకం,తులసి అర్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకొని ఇష్ట దైవాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహావిష్ణువును భక్తిశ్రద్ధలతో కొలిచారు.ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సంపదలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని అర్చకులు సుదర్శనాచార్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# స్మశాన వాటికలో నిరూపయోగంగా బోర్ వెల్ కు మరమ్మతులు.



**బయ్యారం/,జులై 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో శ్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించేందుకు బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ నిరూపయోగంగా ఉన్న బోరు వెల్ మరమ్మతు పనులు శనివారం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే మా ప్రధాన లక్ష్యమని అన్నారు.శ్మశాన వాటికకు వచ్చే ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ బోరు మరమ్మతులు చేపిస్తున్నట్లు తెలిపారు.త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు,లతీఫ్,కమలుద్దీన్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బయ్యారం అడవుల్లో అరుదైన నక్షత్రపు తాబేలు ప్రత్యక్షం.



**బయ్యారం/,జులై 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం మోట్లతిమ్మాపురం ఈస్ట్ బిట్ అటవీ ప్రాంతంలో రైతు వ్యవసాయ క్షేత్ర సమీపంలో ఇస్లావత్ శ్రీను కుమారుడు రాజేందర్ కు ఒక అరుదైన నక్షత్రపు తాబేలు శనివారం కనిపించింది.తాబేలును రాజేందర్ సంరక్షించి అటవీ శాఖ అధికారి శంకర్ కు అప్పగించాడు.ఈ సందర్భంగా ఎఫ్ బిఓ శంకర్ మాట్లాడుతూ నక్షత్రపు తాబేలు అంతరించిపోతున్న అరుదైన జాతికి చెందినదని,మన అడవుల్లో అరుదుగా సంచరిస్తుందని తెలిపారు.వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.సంరక్షించిన తాబేలును అడవి దగ్గర చెరువులో వదిలినట్లు శంకర్ తెలిపారు.వన్యప్రాణి రక్షణలో చురుగ్గా వ్యవహరించిన ఎఫ్ బిఓ శంకర్ ను ఎఫ్ఆర్ఓ రవి కిరణ్ అభినందించారు.

# గంజాయి,సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన.

## -డీఎస్పీ తిరుపతి రావు.




**బయ్యారం/,జులై 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గంజాయి,సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి వంటి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని,గంజాయి నిర్మూలనలో ప్రతి విద్యార్థి పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు.గంజాయి విక్రయాలు,వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ఇన్స్టాగ్రామ్,స్నాప్‌చాట్, వాట్సాప్,ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలను చూడకుండా చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభన్ బాబు,సీఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబు,సర్పంచ్,ఉపసర్పంచ్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీలో పెరుగుతున్న కరోనా కేసులు.. మరో ఏడుగురికి పాజిటివ్

### ఏపీలో విస్తరిస్తున్న కరోనా మహమ్మారి -39కి చేరిన యాక్టివ్ కేసుల సంఖ్య

### కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశం



**జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. తాజాగా మరో 7 కొత్త కేసులు నమోదు కావడంతో, ఇప్పటివరకు ఉన్న మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 39కి చేరింది. బాధితులందరినీ వెంటనే వైద్యుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు వీరితో ప్రైమరీ కాంటాక్ట్‌లో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియను ఆరోగ్య శాఖ సిబ్బంది వేగవంతం చేశారు.పరిస్థితిని సమీక్షించిన అధికారులు... జిల్లాల వారీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు. ఎవరికైనా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులను తరచూ పరిశుభ్రంగా ఉంచుకోవడం చేయాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

### మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ,జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

**జూలై 25 (జర్నలిస్ట్ వార్త):**
విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు-నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది.




పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.